క్లుప్తంగా

మెరుగైన సేవలు అందించాలి

డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



మధురానగర్(విజయవాడసెంట్రల్):సమన్వయంతో పనిచేసి రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. దుర్గాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, ఆయుష్మాన్ భారత్ గుర్తింపు సంఖ్యల నమోదు, ల్యాబ్ పరీక్షలు తదితర సేవలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ సంతృప్తితో వెళ్లేలా సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయునికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం, ఆకు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

కుంగిన పైపులైన్‌కు మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్):30వ డివిజన్ దేవీనగర్ యూజీడీ పంపింగ్‌స్టేషన్ వద్ద కుంగిన పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టారు. వీటి స్థానంలో కొత్తపైపులైన్ వేస్తున్నారు. అలాగే యూజీడీ లీకేజీలకు అవసరమైన మరమ్మతులు చేస్తున్నారు.

మైక్రో కంట్రోలర్‌పై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):నేటి తరం యువత మైక్రో కంట్రోలర్ సబ్జెక్టుపై పట్టు సాధించడం ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవచ్చునని మైక్రో లింక్స్ సంస్థ డైరెక్టర్ వి.గోవిందరావు చెప్పారు. పీబీ.సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో మైక్రో కంట్రోలర్‌పై అవగాహన సదస్సు శనివారం జరిగింది. గోవిందరావు మాట్లాడుతూ మైక్రో కంట్రోలర్ అనేది ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లో ఉండే చిన్న కంప్యూటర్ వంటిందని చెప్పారు. ఈ మైక్రో కంట్రోలర్ ఎంబెడెడ్ అప్లికేషన్‌ల కోసం రూపొందించబడ్డాయని చెప్పారు. ఇంట్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ హోమ్ అప్లయన్స్‌లో అన్నింటినీ ఈ మైక్రోకంట్రోలర్ ద్వారానే పనిచేస్తాయని చెప్పారు. భవిష్యత్తు అంతా ఈ మైక్రో కంట్రోలర్స్ పైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆఫీస్ మెషన్, రోబెటిక్స్, హోమ్అప్లయెన్స్, ఎలక్ట్రానిక్ గాడెజ్జ్‌స్‌లో మైక్రో కంట్రోలర్ వినియోగం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. అందువల్ల మైక్రో కంట్రోలర్స్ అంశంపై పట్టు సాధించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. కళాశాల ఎలక్ట్రానిక్ విభాగాధిపతి కె.సాంబశివరావు మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల్లోని అంశాలను చదవడం ద్వారా కంటే ఆయా రంగాల్లో నిష్ణాతుల చెప్పడం ద్వారా విద్యార్థులకు మరింత ఎక్కువగా అవగాహన అవుతుందన్నారు. అందువల్లనే ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు.

వరద బాధితులకు సాయం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుడమేరు వరదల్లో నష్టపోయిన వరద బాధితులకు శనివారం నిత్యవసర సరుకులు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి మాట్లాడుతూ బుడమేరు వరదల్లో నష్టపోయిన బాధితులకు బాసటగా నిలవాలనే ఉద్దేశంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలలో ఉన్న పలు క్లబ్బుల ద్వారా 700 మంది కుటుంబాలకు సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. క్లబ్ అధ్యక్షురాలు వి.పద్మాలయ, వైస్ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస రెడ్డి, కోఆర్డినేటర్ మద్దినేని చక్రధర్, కొల్లి ఎన్‌వీ రామకృష్ణ ప్రసాద్, అన్నే కుసుమ, సాంబశివరావు, నాగిరెడ్డి స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

మళ్లీ అధ్వానంగా పారిశుద్ధ్యం

నగరంలో వెలుస్తున్న డంపర్‌బిన్‌లు



హనుమంతరాయ గ్రంథాలయం వెనుక భాగంలో డంపర్‌బిన్‌ల వద్ద వ్యర్థాలు



జీఎస్ రాజు రోడ్డులోని రైతు బజార్ వద్ద రోడ్డు పైనే ఏర్పాటు చేసిన డంపర్‌బిన్

- గాలికి ఎగిరి రోడ్డుపై పడుతున్న చెత్త
- హనుమంతరాయ గ్రంథాలయం వద్ద దుర్వాసన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):విజయవాడ నగరం బిన్ లెస్ సిటీ అని చెప్పుకుంటున్నప్పటికీ క్రమేపీ డంపర్‌బిన్‌లు వెలుస్తున్నాయి. మళ్లీ పాత విధానంలోకే వస్తున్నట్లు కనిపిస్తోంది. అక్కడక్కడ డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారుల్లో చెత్త దర్శనమిస్తోంది. పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది టైమ్ టు టైం తొలగిస్తున్నప్పటికీ బిన్స్ ఉండడంతో చెత్త వేస్తూనే ఉన్నారు. క్లాప్ వాహనాలు నిలిచిపోవడం కూడా డంపర్‌బిన్‌లు ఏర్పాటుకు కారణమని తెలుస్తోంది. గాంధీనగర్‌లోని జీఎస్ రాజు రోడ్డు, జ్ఞానోలివ్ రోడ్డు, సాంబమూర్తి రోడ్డులో పలు చోట్ల కార్పొరేషన్ చెత్త డంపర్ బిన్‌లు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో ఇంటింటికి, వ్యాపార సముదాయాలు వద్ద ప్రత్యేకించి బుట్టలు తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించింది. చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు వీలుగా క్లాప్ వాహనాలను ఏర్పాటు చేసింది. రోడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ కారణాలతో క్లాప్ వాహనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం చాలా కొద్ది సంఖ్యలోనే వాహనాలు తిరుగుతున్నాయి. వాటి స్థానంలో ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. క్లాప్ వాహనాల్లో చెత్త నింపి వాటికి పైన మూత పెట్టేవారు. వాహనం వెళ్లే సమయంలో చెత్త రోడ్లపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. ప్రస్తుతం ట్రాక్టర్లు చెత్తను తరలిస్తున్నాయి. ట్రక్‌పైన ఎటువంటి మూత లేకపోవడంతో అవి వెళ్లే మార్గంలో చెత్త రోడ్లపై పడుతోంది.

- హనుమంతరాయ గ్రంథాలయ వెనుక భాగంలో డంపర్ బిన్‌లు పెట్టారు. డంపర్ బిన్‌లు చుట్టూ చెత్త పేరుకుపోతోంది. దీనికి తోడు డంపర్‌బిన్‌లు ఉన్న చోట మూత్ర విసర్జన చేయడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. ప్రస్తుతం ఈ రోడ్డులో కొత్త హోటల్స్ వస్తున్నాయి. ఇక్కడ డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేయడంతో అసౌకర్యంగా మారింది. వీటిని తొలగించాలని దుకాణదారులు కోరుతున్నారు. బిన్‌లు ఉండడం వల్లనే మూత్రవిసర్జన చేస్తున్నారంటున్నారు. వాటిని తొలగిస్తే పరిసరాలు బాగుపడతాయి.
- జీఎస్ రాజు రోడ్డులోని రైతు బజార్ వద్ద మెయిన్ రోడ్డు పక్కన డంపర్‌బిన్ ఏర్పాటు చేశారు. రైతు బజార్‌లో వ్యర్థాలు బిన్‌లో వేస్తున్నారు. దీనికి తోడు మెయిన్ రోడ్డుపక్కనే ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి బైక్‌పై వెళుతూ ప్లాస్టిక్ కవర్లు వేస్తున్నారు. సిబ్బంది తొలగిస్తున్నప్పటికీ వారు చెత్త తొలగించి వెళ్లిపోయిన తర్వాత చెత్త వేయడంతో ఇబ్బందికరంగా మారింది. పైగా గాలి వీచినపుడు చెత్త రోడ్డుపై ఎగిరిపడుతుంది. దీంతో బైక్‌లు, వాహనాలు నడిపేవారికి ఇబ్బందికరంగా తయారైంది. ఎక్కడో మారుమూల ప్రాంతంలోనో.. ఏదైనా ఖాళీ స్థలంలోనో అయితే ఇబ్బంది ఉండేది కాదు.
- సాంబమూర్తి రోడ్డులో అలంకార్ సబ్ స్టేషన్ వద్ద కాలువ గట్టుపై పెద్ద రైతు బజార్ ఏర్పాటు చేశారు. 100 కుపైగా షాపులు ఉన్నాయి. వీటికి తోడు రైతుబజార్ ఎదురుగా రోడ్డుపక్కన చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో చేరారు. ఇక్కడ కూరగాయల వ్యర్థాలు చెత్తా చెదారం పెద్ద ఎత్తున వస్తోంది. రోడ్డు పక్కనే డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేయడంతో ఆ చెత్తంతా వాటిలో వేస్తున్నారు. ఇక్కడ కుళ్లిన కూరగాయాలు , ఇతర వ్యర్థాలతో పరిసరాలు వాసన వస్తున్నాయి. పైగా రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. చిరు వ్యాపారులు రోడ్డు మధ్యవరకు వ్యాపారాలు చేసి రోడ్లపైనే పాడైన కాయలు, పేపర్లు పడేస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. డంపర్ బిన్‌లు తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డీజీ యాప్ ద్వారా బాలల భద్రత

జిల్లా బాలల సంక్షేమ, సంస్కరణల శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ టి. జ్యోతి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా నోడల్ అధికారి జ్యోతి, నవజీవన్ బాలభవన్ ప్రతినిధులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):బాలల భద్రతకు హోమ్ లింక్ డీజీ యాప్ చక్కగా ఉపయోగపడుతుందని స్వచ్ఛంద సంస్థలు హోమ్ లింక్ డీజీ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా బాలల సంక్షేమ, సంస్కరణల శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ టి. జ్యోతి అన్నారు. బావాజీపేటలోని నవజీవన్ బాల భవన్ లో డాన్ బోస్కో యంగ్ అండ్ రిస్క్ ఫోరమ్ హైదరాబాద్ ప్రావిన్స్, నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన శనివారం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సాఫ్ట్‌వేర్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు పరిరక్షణకు డాన్ బోస్కో యంగ్ అండ్ రిస్క్ ఫోరమ్ హైదరాబాద్ ప్రావిన్స్ రూపొందించిన హోమ్ లింక్ డిజి యాప్ సమర్థవంతంగా పనిచేస్తుందని చెప్పారు. వీధిబాలలు అదృశ్యమైన బాలలు, బాలలకు అందించే సేవలు, బాలల సంరక్షణా కేంద్రాలు నిర్వహించే కార్యక్రమాలు అన్ని ఒకే యాప్ ద్వారా సమాచారాన్ని భద్రపరుస్తుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలకు ఈ హోమ్ లింక్ డీజీ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ యాప్‌ని రూపొందించిన డాన్ బోస్కో యంగ్ అండ్ రిస్క్ ఫోరమ్ హైదరాబాద్ ప్రావిన్స్ , నవజీవన్ బాల భవన్ వారిని అభినందించారు. నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ డాన్ బోస్కో యంగ్ అండ్ రిస్క్ ఫోరమ్ హైదరాబాద్ ప్రావిన్స్ అండ్ స్పానిష్ ప్రభుత్వం సంయుక్తంగా హోమ్ లింక్ అనే సాఫ్ట్ వేర్‌ని అభివృద్ధి చేశారన్నారు. ఈ సాఫ్ట్ వేర్ ని గత 20 సంవత్సరాలుగా డాన్ బోస్కో సంస్థలలో వాడుతున్నామని వెల్లడించారు. హబ్ కోఆర్డినేటర్ ఎం.స్వర్ణగౌరీ, నవజీవన్ బాల భవన్ హెచ్‌ఆర్ ఆఫీసర్ జోసెఫ్ డోనాల్డ్, నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమాలు



ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో శ్రీ భోగ శ్రీనివాసమూర్తి సంప్రోక్షణ కార్యక్రమాలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఆగమ శాస్త్ర పండితులు నల్లూరి మోహన రంగాచార్యులు పర్యవేక్షణలో వైభవంగా జరుగుతున్నాయి . వైదిక కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా యాగశాలను నిర్మించారు. పుణ్యాహ వాచనం, అకల్మష ప్రాయశ్చిత్యహోమం, పంచగవ్య ప్రసాన, రక్షాబంధన హారతి, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఆగమోత్తంగా నిర్వహించారు. ఆగమ శాస్త్ర పండితులు రంగాచార్యులు మాట్లాడుతూ దేవాలయాలో నిర్వహించే పూజలు, యాగాలు, క్రతువులు ఆగమ శాస్త్ర ప్రకారమే జరుగుతాయని చెప్పారు. సంప్రోక్షణ కార్యక్రమాలు వీక్షించడం జన్మసుకృతంగా భావించాలని తెలిపారు. కామకన భట్టార్, ఆర్ బీఎమ్‌కే అయ్యన్న, సూర్యకుమారాచార్యులు సంప్రోక్షన కార్యక్రమంలో సహకరించారు. నగరానికి చెందిన భక్తుడు భోగశ్రీనివాసుని విగ్రహాన్ని టీటీడీ శిల్పులతో తయారు చేయించి దేవాలయానికి అందించారు. టీటీడీ కల్యాణమండపాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నప్రసాదం అందించారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి ప్రదర్శన



సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం విజయవాడలోని నందకుమార్ డ్యాన్స్ ఇన్సిస్టిట్యూట్‌కు చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కె.చైతన్య శిష్యబృందం పలుకీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. చిన్నారులు రిషిక, లాలస, లలన, హేతిక, నాగ భవానీ, సుదీక్ష, దీక్ష, లిఖిత, తనిష్క, ధనశ్రీ, జానులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ డీఈవో రత్నరాజు ప్రసాదాలను అందజేశారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో సహస్ర లింగార్చన

కార్తీమాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో సహస్ర లింగార్చన చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో అర్చకులు సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారికి విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులకు సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

స్కూల్‌కు సీలింగ్ ఫ్యాన్లు అందజేత



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌కు 15 సీలింగ్ ఫ్యాన్‌లను శనివారం బహూకరించారు. క్లబ్ సభ్యులు కోనేరు మధు, నగేష్, నాగ వసంతకుమార్‌లు పాల్గొని పాఠశాల ఉపాధ్యాయులకు ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు సహాయం చేయాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. స్కూల్ విద్యార్థులకు ఉపయోగపడేలా తమ క్లబ్ ద్వారా ఫ్యాన్లు అందించడం ఆనందంగా ఉందన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వేధిస్తున్నారంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఇన్‌స్టాగామ్‌తో పరిచయం ప్రేమగామారటంతో వివాహం చేసుకున్న కొద్ది నెలలకే బాలికను భర్త, ఆడపడుచు వేధిస్తున్నారంటూ శనివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా వంగాయిగూడెంకు చెందిన నాగిరెడ్డి రేష్మకు ఇద్దరు సంతానం. కుమార్తె నాగిరెడ్డి పద్మావతి (16) పదోతరగతి పరీక్షలు ముగిసిన తరువాత తల్లి మొబైల్‌లో ఇన్‌స్టాగామ్‌లో తల్లిదండ్రులకు తెలియకుండా విజయవాడకు చెందిన వల్లభ రాంపండుతో చాటింగ్ చేసింది. జూన్ 29న ఇంట్లో ఎవరూలేని సమయంలో పద్మావతి ఇంట్లోంచి వెళ్లిపోయి రాంపండును వివాహం చేసుకుంది. ఈ నెల 15వ తేదీన పద్మావతి తల్లి రేష్మకు ఫోన్‌చేసి రాంపండు, వాళ్ల అక్క నాగేంద్ర ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారని, తన ఇష్టం లేకుండా రాంపండు శారీరకంగా కలుస్తున్నట్లు, డబ్బులు తీసుకురావాలంటూ శారీరకంగా, మానసికంగా వేదిస్తున్నట్లు తెలిపింది. దీంతో రేష్మ శనివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరవాసులు పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరవాసులు వీఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్ను, డ్రైనేజీ పన్నులను చెల్లించాలని వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సుజన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీఎంసీకి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న క్యాష్ కౌంటర్లలో సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణలో డ్రోన్ సర్వేలెన్స్‌పై సమీక్ష

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో నిర్వహిస్తున్న సర్వేలెన్స్‌లో భాగంగా శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పారిశుద్ధ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు డ్రోన్ సర్వేలెన్స్ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ డ్రోన్ సర్వే ద్వారా గమనించిన వ్యర్థాలను తొలగించేందుకు 286 సచివాలయాల శానిటరీ సెక్రటరీలు సంసిద్ధులు కావాలన్నారు. డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచే విధానంలో పాటించాల్సిన అంశాలను చర్చించారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ బాబు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి



విజేతలను అభినందిస్తున్న గుంటూరు హరిబాబు, నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని చైతన్య కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. ఏలూరు రోడ్డు శ్రీచైతన్య కళాశాలలో ఎస్‌జీఎఫ్ థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో పాడేరులో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి ఎం.భాను ప్రియ అండర్ 14, 17, 19 బాలికల విభాగంలో బంగారు పతకం సాధించిందన్నారు. అలాగే ఉప్పు శ్యాంకుమార్ రజత పతకం సాధించారని చెప్పారు. తక్కిన విద్యార్థులు విజేతలను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తద్వారా విద్యలో కూడా మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నీలిమ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విజేతలను అభినందించారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో సెప్టెంబర్ నెలలో సంభవించిన వరద కారణంగా పుస్తకాలు కోల్పోయిన విద్యార్థులకు ఏపీటీఎఫ్ అండగా నిలిచింది. ఏపీటీఎఫ్ సభ్యులు విరాళాలు సేకరించి ఆ డబ్బుతో విద్యార్థులకు అవసరమైన కిట్లు పంపిణీ చేశారు. శనివారం జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి బ్లాంకెట్, ఒక బెడ్ షీట్, ఒక రైటింగ్ ప్యాడ్, ఐదు పెన్నులతో కలిపి ఒక కిట్టుగా రూపొందించి అందజేశారు. నగరంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 2500 మంది విద్యార్థులకు ఈ కిట్లను అందజేయడం జరుగుతుంది. కార్యక్రమంలో విజయవాడ నార్త్ మండల విద్యాశాఖాధికారి-2 వెంకటేశ్వరరావు, ఏపిటియఫ్ జిల్లాశాఖ అధ్యక్షులు వి. రాధిక, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి. పాండురంగ వరప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నయీం అహ్మద్, యం.దుర్గాప్రసాద్, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ దొరకని గల్లంతైన యువకులు



ఉప్పలపాటి శివతేజ (ఫైల్)



ఎండీ మున్వర్ (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):జక్కంపూడి సమీపంలోని పోలవరం కాలువ వద్ద సెల్ఫీలు దిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ ఆ కాలువలో పడిపోయి గల్లంతైన సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకుల ఆచూకీ రెండు రోజులైనా తెలియకపోవడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ ఎదురు నివసిస్తున్న ఉప్పలపాటి వాసు, సాయిలత దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు శివతేజ (18), ఒక పాప సంతానం ఉన్నారు. కార్పొరేషన్ మలేరియా విభాగంలో మేస్త్రిగా పనిచేస్తున్న వాసు పిల్లలిద్దరినీ చక్కగా చదివిస్తున్నాడు. శివతేజ ఓ ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లో ఐఐటీ చదువుతున్నాడు. అలానే సింగ్‌నగర్ స్మైల్ హాస్పటల్ వెనుక రోడ్డులో నివసిస్తున్న ఎండీ బాషా, గోరాహున్నీసా దంపతులకు కుమారుడు మున్వర్(18), ఒక పాప సంతానం ఉన్నారు. మున్వర్ ఓ ప్రైవేటు కాలేజ్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. శివతేజ, మున్వర్‌లు స్నేహితులు. వీరితో పాటు తమ బాల్య స్నేహితులు మరో నలుగురుతో కలిసి శుక్రవారం జక్కంపూడి సమీపంలోని పోలవరం కాలువ వద్దకు సెల్ఫీలు దిగేందుకు వెళ్లారు. ఈ క్రమంలో నీటి వద్దకు వెళ్లి ఫొటోలు దిగేందుకు ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పి పోలవరం కాలువలో పడిపోయారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాలువలో ముందుకు కొట్టుకుపోయారు. ఒడ్డు మీద ఉన్న మిగిలిన స్నేహితులు వారిని రక్షించేందుకు ఎంతగా శ్రమించినా కళ్లముందే కనుమరుగైపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారి జాడ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు ప్రయత్నించినా వారి ఆచూకీ లభించకపోవడంతో శివతేజ, మున్వర్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. చేతికి అందివచ్చిన తమ కుమారులు ఒక్కసారిగా ఇలా కనిపించకుండా పోవడంతో వారు తమ పిల్లల ఫొటోలను పట్టుకొని ఏడుస్తున్నారు. తమ బిడ్డలు ఎక్కడైనా క్షేమంగా ఉండాలని ప్రార్థనలు చేస్తున్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా



వాంబేకాలనీలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని.. స్మార్ట్ మీటర్లు పెడితే పగలకొట్టమని నాడు చెప్పిన చంద్రబాబునాయుడు ఇప్పుడు వాటినే బిగించి ప్రజల నెత్తిపై విద్యుత్ భారాలను మోపాలని చూడడం తగదని సీపీఎం నాయకులు కె.దుర్గారావు అన్నారు. ప్రజలపై భారాన్ని మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి స్కూల్ సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఆదాని స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని.. ట్రూ ఆప్, సర్దుబాటు చార్జీల పేరిట కరెంటు చార్జీలు పెంచొద్దని.. విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని.. వేల కోట్ల రూపాయల కుంభకోణం చేసిన ఆదానిని అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ అదానికి అంటకాగుతూ స్మార్ట్ మీటర్లకు అనుమతినిస్తే టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాల్సింది పోయి స్మార్ట్ మీటర్లు బిగించడం.. ప్రజలకు ఇచ్చిన మాట తప్పడం కాదా అని ప్రశ్నించారు. సీపీఎం నాయకులు ఎస్‌కే పీరు సాహెబ్, రత్నకుమారి, రజిని, అప్పన్న, రంగస్వామి, సత్యనారాయణ, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మధురంగా యువ సంగీత సమ్మేళనం



వయోలిన్ కచేరి నిర్వహిస్తున్న తిరుపతి సోదరులు

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంగీత కార్యక్రమాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. తిరుపతి సోదరులుగా ప్రసిద్ధి చెందిన యువ సంగీత కళాకారులు తుమ్మలూరి సంపత్‌కుమార్, సంకీర్త కుమార్ వయోలిన్‌పై సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన కీర్తనలను వయోలిన్‌పై పలికించారు. అజిత్ శ్రీధర్ మృదంగంపై సహకరించారు. రెండవ కార్యక్రమంగా సోమాపురపు సోదరులు, వనమాలి, మాధవ్ వేణువుపై సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరముందన్నారు. కార్యదర్శి సీవీరావ్ మాట్లాడుతూ ఏటా యువ సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. యువ సంగీత కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.